సాక్షి
కామారెడ్డి

ఆదివారం । 7 । మే । 2023



'ఓపెన్' అక్రమాలపై విచారణేది!
తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించడం లో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.
- 8లో ▸



అమాత్యా.. హామీ గుర్తుందా?
దోమకొండలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తా మని ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ ఆరేళ్ల క్రితం ఇచ్చిన హామీ నెరవేరలేదు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.0 /24.0

వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. ఈదురు గాలులు వీయవచ్చు.

న్యూస్‌రీల్

మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం



పెద్దకొడప్‌గల్: మార్కెట్‌లో ధరలు తగ్గాయని రైతులు ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగా రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యే హన్మంత్ సిందేతో కలిసి శనివారం ఆయన పెద్దకొడప్‌గల్ సొసైటీలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్నకు క్వింటాలు రూ. 1,962 ప్రకారం కొనుగోలు చేస్తామని వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు బంధు, రైతు బీమాతో ఎంతో ప్రయోజనం చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్ రెడ్డి, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ తిర్మల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, తహసీల్దార్ దశరథ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



బాన్సువాడ: బాన్సువాడ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో భాగంగా బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11వేలు నిర్మించి ఇచ్చామన్నారు. పేద వారి సొంతింటి కల సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వ సబ్సిడీ ఇళ్లు ఇంత పెద్ద మొత్తంలో మంజూరు కావడం దేశంలోనే మొదటిసారి అని పేర్కొన్నారు. వందశాతం సబ్సిడీతో ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసిందని, 11వేల ఇళ్లలో కాంట్రాక్టర్ల ద్వారా 3వేల ఇళ్లు, కట్టిస్తే మిగతా 8వేల ఇళ్లు లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్నారన్నారు. విడతల వారీగా లబ్ధిదారులందరికీ బిల్లులు వస్తున్నాయని, త్వరలోనే రూ. 3లక్షల ఇంటి పథకం అమలులోకి వస్తుందన్నారు. పేద కుటుంబాలకు తక్కువ ఖర్చుతో వివాహాలు చేసుకోవడానికి నియోజకవర్గంలో రూ. 50 కోట్లతో 80 ఫంక్షన్ హాల్స్ నిర్మిస్తున్నామని, వీటిలో రోజుకు రూ. 5 వేలు మాత్రమే కిరాయి రూపంలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, నాయకులు మోహన్‌నాయక్, వెంకట్‌రాంరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లకు ప్రభుత్వవిప్ క్షమాపణ చెప్పాలి



కామారెడ్డి టౌన్: భిక్కనూరు మండలం పూర్ణిమ రైస్‌మిల్ గుమాస్తాపై చేయి చేసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి 11 గంటకు వెళ్లి రైస్‌మిల్ సిబ్బందిపై చేయి చేసుకోవడం విచారకరమన్నారు. కానీ రైస్‌మిల్లర్లు అన్‌లోడింగ్ అవితే రైతులకు నష్టం జరుగుతుందన్నారు. అలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. రైతులను వారి కష్టనష్టాలను దృష్టిలో పెట్టుకొని రైస్‌మిల్లర్లు లోడింగ్, అన్ లోడింగ్ ప్రారంభించాలని కోరారు. రైస్ మిల్లర్లు అన్ లోడింగ్, మిల్లింగ్ నిలిపివేయడానికి ఎమ్మెల్యేనే కారణమన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు మిల్లర్లకు, రైతులకు వారధిగా ఉండాలన్నారు. ఈ ఘటన అధికారుల అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇలాంటి తప్పులు పునరావృతం కావద్దని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు తేలు శ్రీనివాస్, హన్మండ్ల సురేష్, అవదూత నరేందర్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహా ఆవకాయ..!



మామిడికాయ తొక్కు కలుపుతున్న మహిళ

- ప్రతి ఇంటా జార్‌ల నిండా తొక్కులు
- మొదలైన పచ్చళ్ల సీజన్
- మార్కెట్‌లో మామిడికాయలకు డిమాండ్
- బిజీ లైఫ్‌లో రెడీమేడ్ పికిల్స్ కొనుగోలు

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: వేడివేడి అన్నం, అవకాయ తొక్కు అందులో కాసింత నెయ్యి కలిపి ఆరగిస్తే ఆ మజాయే వేరు. మామిడికాయ తొక్కు ఉంటే చాలు పేదోడి నుంచి ఉన్నోడి దాకా అందరూ లొట్టలేసుకుని తింటారు. మామిడి కాయల సీజన్ వచ్చిందంటే చాలు ప్రతి ఇంటా తొక్కుల కోసం కావాల్సిన పొడులు రెడీ చేసుకుంటారు. పౌర్ణమి ముందర తొక్కులు పెడితే చెడిపోతాయన్న భావనతో పౌర్ణమి దాటగానే ఇంటింటా మామిడి కాయ తొక్కులు సిద్ధం చేస్తుంటారు. వ్యవసాయ కుటుంబాల్లో అయితే ఏడాదికి సరిపడా తొక్కులు తయారు చేసి పెద్దపెద్ద జార్(మడతమాన్)లలో నిల్వ చేసి పెట్టుకుంటారు. పొలం పనులకు వెళ్లేటపుడు సద్దిమూటలో అవకాయ తొక్కులు ఉండాల్సిందే. ఒక్కోసారి కూరలు వండుకోలేని పరిస్థితుల్లో తొక్కుతో వెళ్లదీసుకుంటారు. ఉన్నత వర్గాల్లో ఎన్ని రకాల కూరగాయలు ఉన్నా, అందుకు ఏదో ఒక తొక్కు ఉండాల్సిందే. ఇలా ప్రతి కుటుంబానికి తొక్కులతో అవినాభావ సంబంధం ఉంటుంది. తొక్కుల తయారీకి మామిడి కాయలతో పాటు కారంపొడి, ఉప్పు, పల్లి నూనె, ఆవాలు, మెంతులు, వెల్లిపాయలు, పసుపు వినియోగిస్తారు. సీజన్‌లో ఆయా వస్తువుల ధరలు పెరుగుతుంటాయి. అయినప్పటికీ ప్రతి ఇంటా పచ్చళ్లు తయారు చేసుకుంటారు.



మామిడి కాయలను ముక్కలుగా కొడుతూ..

సీజన్ వచ్చేసింది..

తొక్కులు(పచ్చళ్లు) తయారు చేసుకుని ఏడాది పాటు ఉండేలా జార్లలో వాటిని నిల్వ చేస్తారు. ఉగాది పచ్చడిలో మామిడి కాయ ముక్కల్ని వేస్తారు. అప్పటి నుంచే మామిడి కాయలు తినడం మొదలవుతుంది. మామిడి కాయలు పెరిగి పెద్దయి, పీచు కట్టిన తర్వాత తొక్కుల కోసం కోసి అమ్ముతారు. మామిడి కాయ తొక్కులు రకరకాలుగా పెట్టుకోవడం ఆనవాయితీ. అవకాయ, సొప్పు తొక్కులు పెట్టుకుంటారు. అవకాయలో ఉప్పావ అని, అల్లం ఆవ అని, బెల్లం అవకాయ, మెంతి అవకాయ.. ఇలా రకరకాల అవకాయలు పెట్టుకుంటారు. వ్యవసాయ కుటుంబాల్లోనైతే సీజన్ వచ్చిందంటే చాలు పెద్దపెద్ద జార్ల నిండా తొక్కులు సిద్ధం చేసుకుంటారు. రోజూ అన్నంలో కూరలతో పాటు తొక్కులు కలుపుకుని తింటారు. సద్దిమూటలో తొక్కు తప్పనిసరిగా తీసుకెళ్తారు. కూలీ పనులకు వెళ్లేవారు, ఇతర పనులకు వెళ్లే వారిలో చాలా మంది సద్దిలో తొక్కు ఉండేలా చూసుకుంటారు. ఒక్కోసారి సమయానికి కూర వండుకోలేకుంటే తొక్కునే తీసుకువెళ్తారు. సీజన్‌లో అందరూ తొక్కులు తయారు చేసుకుని ఊరబెట్టుకోవడంపై ఆసక్తి చూపుతారు. కామారెడ్డి పట్టణంలోని ఓరియంటల్ స్కూల్ తొక్కులకు అవసరమైన మామిడి కాయల విక్రయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటుంది. సీజన్ వచ్చిందంటే చాలు రోజూ మామిడి కాయలతో ఆ ప్రాంగణం నిడిపోతుంది. పట్టణానికి చెందిన వారే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వచ్చి మామిడి కాయలు కొనుగోలు చేసి తీసుకెళ్తారు. మామిడి కొనుగోలు చేసిన తర్వాత ముక్కలు కూడా అక్కడే నరికి ఇస్తున్నారు. ఒక్కో కాయ నరకడానికి రూ. రెండు తీసుకుంటారు.





కామారెడ్డిలో మామిడికాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



ఆధునిక కాలంలోనూ..
మార్కెట్‌లో రకరకాల పచ్చళ్లు వచ్చాయి. దీంతో కొంత మంది రెడీమేడ్ పచ్చళ్లు కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇప్పటికీ చాలా కుటుంబాలు సొంతంగా తొక్కులు తయారు చేసుకోవడంపై ఆసక్తి చూపుతారు. రెడీమేడ్ పచ్చళ్ల కన్నా సొంతంగా చేసుకున్నవి ఎక్కువ కాలం మనడంతో పాటు రుచికరంగా ఉంటాయి. రెడీమేడ్ పచ్చళ్లకు ఎక్కువ డబ్బులు వెచ్చించాల్సి ఉంటుంది. అదే ఇంట్లో తయారు చేసుకునే పచ్చళ్లు రుచికరంగా ఉండడంతో పాటు తక్కువ డబ్బులతో చేసుకోవచ్చు. సీజన్ మొదలు కావడంతో ప్రతి ఇంటా అవకాయ తొక్కులు తయారీలో మహిళలు బిజీ అయ్యారు. మిరపకాయలు కొనుగోలు చేసి ఇప్పటికే కారం రెడీ చేసుకున్నారు. ఇతర పొడులు కూడా సిద్ధం చేసుకున్నారు. మామిడి కాయలు కొనుగోలు చేసి ముక్కలు చేసిన తర్వాత అన్నింటినీ కలిపి తొక్కులు పెడుతుంటారు.

అందరికీ ఇష్టమే..



అవకాయ తొక్కు అంటే అందరికీ ఇష్టమే. పిల్లలు కూడా అన్నంతో ఇష్టంగా తింటారు. ప్రతియేటా అవకాయ తొక్కు పెట్టుకుని, జార్లలో నిల్వ చేస్తాం. వాడుకునేందుకు చిన్న చిన్న జార్లలోకి తీసుకుంటాం. అన్నం, కూరలతో పాటు అవకాయ తప్పనిసరిగా ఉండాలని అందరూ కోరుకుంటారు.
– రాణి, ఎల్లారెడ్డి

ముప్పై ఏళ్లుగా..



ముప్పై ఏళ్లుగా ప్రతి ఏడాది నేను తొక్కులు పెడుతున్నా. మామిడి ఆవతో పాటు కొబ్బరి ఆవ, ఉప్పు ఆవ చేస్తుంటాను. పిల్లలు ఎక్కువగా ఉప్పు ఆవను ఇష్టపడతారు. ఆవలేకుండా భోజనం చేయడం ఉండదు. ఏడాదికి సరిపడా ఆవతొక్కులు పెట్టుకుంటాం.
–ముస్తాల విజయలక్ష్మి, ఎల్లారెడ్డి

యేటా తొక్కులు పెట్టుకుంటాం



ఆవ తొక్కు లేని దినం ఉండది. యాడాదికి సరిపడా తొక్కులు పెట్టుకుంటాం. తొక్కు పెట్టేతందుకు మూడు రోజుల ముందు నుంచి కావాల్సిన సామాన్లను సిద్ధం చేసుకుంటాం. పొలం పనులకు వెళ్లేటపుడు సద్దిలో తొక్కు తప్పకుండా తీసుకువెళ్తాం.
–రోని దుర్గమ్మ, బీబీపేట

వివిధ రకాలుగా..



అవకాయ తొక్కులంటే మా ఇంట్లో అందరికీ ఇష్టం. రకరకాల అవకాయ తొక్కులు పెట్టుకుంటాం. తొక్కులకు అవసరమయ్యే వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఈసారి వర్షాలతో మామిడి కాయల ధరలు కూడా పెరిగాయి. అయినా తొక్కులు తయారు చేసుకోవాల్సిందే.
–అమర జ్యోతి, కామారెడ్డి

తొక్కులేని ఇల్లు ఉండదు..



మా దగ్గర తొక్కులు లేని ఇల్లు ఉండదు. మామిడి కాయలు పీచు కట్టిన తర్వాత తొక్కులు పెట్టుడు మొదలైతది. మాతో పాటు పిల్లలకు కావాల్సిన తొక్కులు పెట్టి వారికి పంపించడం జరుగుతుంది. అందరి ఇళ్లల్లో తొక్కులు పెట్టుకుంటారు. ఒకరికొకరు సాయం కూడా చేసుకుంటాం.
–జగ్గన్నగారి నిర్మల, రామేశ్వర్‌పల్లి

రైస్‌మిల్లర్ల మోసాలను అరికట్టాలి

- రోడ్డుపై బైఠాయించి రైతుల ఆందోళన
- సమస్యను కలెక్టర్‌కు వివరించిన అన్నదాతలు
- చర్యలు తీసుకుంటామని హామీ



కలెక్టర్ వాహనాన్ని ఆపుతున్న రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): తాలు గింజల పేరిట రైస్‌మిల్లర్ యజమాని లారీకి 17బస్తాల ధాన్యం కోత విధించడంపై రైతులు ఆందోళన చేపట్టారు. శనివారం లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన పలువురు రైతులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. మెంగారం కొనుగోలు కేంద్రం నుంచి గత నెల 30న మాచారెడ్డి మండలం ఫరీదుపేటలోని శ్రీసాయి మణికంఠ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లుకు 567 ధాన్యం బస్తాలను లారీలో లోడ్‌చేసి తరలించారని తెలిపారు. ఈ క్రమంలో రైస్‌మిల్లు యజమాని వద్దలో తాలు గింజలు బాగా ఉన్నాయని ధాన్యం తరుగు పేరిట కోత విధించినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 17 బస్తాలు ఒక్కో బస్తాకు 42.100 గ్రాములు మొత్తం ఏడు క్వింటాళ్లు కోత విధించినట్లు రైతులు గమనించారు. ఈ విషయమై సెంటర్ నిర్వాహకుడు రాములుతో చర్చించారు. ఈ విషయమై రైస్‌మిల్లు నిర్వాహకుడు రమేశ్‌తో మాట్లాడగా రైస్‌మిల్లుకు 554 బస్తాలు మాత్రమే వచ్చాయని బుకాయించాడు. దాంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెంగారం సెంటర్ వద్ద కామారెడ్డి ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈసమయంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ కామారెడ్డికి వెళ్తుండగా రైతులను చూసి కారు ఆపారు. వారితో మాట్లాడగా రైతులు రైస్‌మిల్లు యజమాని చేస్తున్న మోసాని కలెక్టర్‌కు వివరించారు. రైతులు చూపిన ట్రక్ షీట్‌ను కలెక్టర్ పరిశీలించారు. రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

సత్వరమే బిల్లుల చెల్లింపులు జరగాలి

- తడిసిన ధాన్యాన్ని సేకరించాలి
- ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన బిల్లులను సత్వరమే చెల్లించేందుకు చొరవ చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం, కంటి వెలుగు శిబిరాలను విరివిగా సందర్శిస్తూ, క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు జరిగేలా చూడాలన్నారు. డబుల్ బెడ్‌రూం పథకంతో పాటు కంటి వెలుగు, ఆరోగ్య మహిళా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఎరువుల నిల్వలను సమకూర్చుకోవడం, జీవో నెం.లు 58, 59, 76, 118 అమలు, ఆయిల్‌పాం లక్ష్య సాధన, ఎంసెట్ అంశాల ప్రగతిపై సూచనలు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి, బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో బిల్లులు జమ చేసే విషయంలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆరోగ్య మహిళ, కంటి వెలుగులకు స్పందన
వీసీలో భాగంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఎర్రపహాడ్, బీర్కూర్ పీహెచ్‌సీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరాలకు మహిళలు వచ్చేలా గ్రామ సంఘాల సమావేశాల్లో ఐకేపీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారని వెల్లడించారు. సీఎంఆర్ కింద రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని నిర్దిష్ట గడువులోగా మిల్లింగ్ జరిపి పౌర సరఫరాల శాఖకు బియ్యం నిల్వలు చేరవేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కంటి వెలుగు, ఆరోగ్య మహిళా కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఆర్డీవో శ్రీను, ఏవో రవీందర్ పాల్గొన్నారు.

బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్ల తొలగింపుపై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వారీగా మృతి చెందిన వారి పేర్లను తొలగించాలన్నారు. బూత్ ఏజెంట్లు తమ పరిధిలో పది మందికి సంబంధించిన ఫారాలను మార్పులు, చేర్పుల నిమిత్తం బూత్ స్థాయి అధికారికి ఇవ్వవచ్చని తెలిపారు. ఒక ఓటరుకు ఒకటికి మించి ఓట్లు ఉంటే అదనంగా ఉన్న ఓట్లను తొలగించేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఒక ఇంట్లో ఐదు ఓట్లు ఉంటే వారి పేర్లు ఒకే వార్డులో కాకుండా ఇతర వార్డుల్లో వచ్చాయని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఒక ఇంట్లోని ఓటర్లందరూ అదే వార్డులో ఉండే విధంగా బూత్ స్థాయి అధికారికి దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎన్నికల పర్యవేక్షకుడు సాయి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.




ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్

పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగాలి
ఎల్లారెడ్డి: విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో స్పార్కిల్స్ సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ 15 రోజుల సమ్మర్ క్యాంపును నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్యాంపులో విద్యార్థులకు పబ్లిక్ స్పీకింగ్, లైఫ్ స్కిల్స్, ఆర్ట్ క్యాంప్, థియేటర్ ఆర్ట్స్ అంశాలపై భిక్కనూరు, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, బాన్సువాడ, బిచ్కుంద గురుకులాల విద్యార్థులు నేర్చుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులు నేర్చుకున్న పేయింటింగ్, డ్రాయింగ్, స్పీచ్ అంశాలను తిలకించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ జాయింట్ సెక్రెటరీ శారద, జెడ్పీటీసీ ఉషాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వండి..

- వీసీ, రిజిస్ట్రార్ చాంబర్‌ల వద్ద అవుట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా



వీసీతో మాట్లాడుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఖలీల్‌వాడి/సుభాష్‌నగర్ : తెలంగాణ యూనివర్సిటీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు ఏప్రిల్‌కు సంబంధించిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వీసీ, రిజిస్ట్రార్ చాంబర్‌లను ముట్టడించారు. ప్రతినెల 1, 2 తేదీల్లో వేతనాలు బ్యాంకు అకౌంట్లలో పడేవని, ఈసారి ఇంత వరకు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వీసీ, రిజిస్ట్రార్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. రెండున్నర గంటల పాటు తెయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి వీసీ, రిజిస్ట్రార్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సోమవారం అందరికీ వేతనాలు చెల్లిస్తామని వీసీ, రిజిస్ట్రార్లు హామీ ఇచ్చారు.

చెక్కులను నిలిపివేసిన బ్యాంకు అధికారులు
వర్సిటీలోని టీచింగ్, నాన్ టీచింగ్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోసం రిజిస్ట్రార్ నిర్మల దేవి పంపిన చెక్కులను ఎస్బీఐ అధికారులు నిలిపివేశారు. రిజిస్ట్రార్‌గా యాదగిరిని నియమించినట్లు ఈసీ సమావేశంలో తీసుకున్న మినిట్ పత్రంలో ఉందని, దీని ఆధారంగా చెక్కులపై యాదగిరి సంతకమే చెల్లుతుందని బ్యాంకు అధికారులు వీసీ దృష్టికి తెచ్చారు. యాదగిరిని రిజిస్ట్రార్‌గా తీర్మానం చేశారే తప్ప హామీ ఇవ్వలేదని, తాను చైర్మన్ హోదాలో నిర్మల దేవికి రిజిస్ట్రార్ పోస్టింగ్ ఇచ్చానని, పాత రిజిస్ట్రార్ విద్యావర్ధిని ద్వారా అమె చార్జి తీసుకున్నారని వీసీ బ్యాంకు అధికారులకు సూచించారు. అయితే బ్యాంకు అధికారులు ఆ విషయాలు తమకు సంబంధం లేదని, బ్యాంకు రీజినల్ అధికారుల ఆదేశాల మేరకు చెక్కులను ఆమోదిస్తామని స్పష్టం చేశారు. ఈసీ మీటింగ్‌లో మీరు వీసీగా గైర్హాజరైనట్లు ఈసీ బ్యాంకులకు లేఖ పంపిందని తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ ప్రమాదాలపై ఉద్యోగులు, వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ టెక్నికల్ డీఈ రమేష్ అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పవర్ హౌస్ మీటింగ్ హాల్లో ఎన్పీడీసీఎల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించారు. సీపీఆర్ ఆవశ్యకతను డాక్టర్ శ్రీశైలం వివరించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఆంజనేయులు, ఏడీఈలు తోట రాజశేఖర్, చంద్రశేఖర్, వీరేశం, ఏవో గంగారాంనాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



భావేశ్ (ఫైల్)

భిక్కనూరు: తాను చదివిన చదువుకు ఉద్యోగం రాక పోవడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన కుడిక్యాల భావేశ్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై హైమద్ తెలిపారు. భావేశ్ రెండు రోజుల క్రితం శ్రీసిద్దరామేశ్వరాలయం సమీపంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఆయనను చికిత్స కోసం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించగా శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బాల్‌కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

తుక్కోజీవాడికి చెందిన వృద్ధుడు..

సదాశివనగర్: మండలంలోని తుక్కోజీవాడి గ్రామానికి చెందిన ఒకరు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన గంగోల్ల కొండిబరావు(73) కల్వరాల్ శివారులోని భారత్ పెట్రోల్ బంక్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. మార్చి 11న బంక్‌లో ఉండగా.. పక్కనున్న చెట్టుపైకి కోతులు వచ్చాయి. వాటిని అక్కడ ఉన్న ఇనుప బద్దతో కొట్టగా అది ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కరెంట్ పెద్దలైన్‌కు తగలడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి అల్లుడు సంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

'ఓపెన్' అక్రమాలపై విచారణేది?

- సబ్జెక్ట్‌కు రూ.వెయ్యి, ఇతరులతో రాయిస్తే రూ.20వేలు వసూలు!
- అవినీతిపరులపై చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- బుజ్జగిస్తున్న పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు
- కలెక్టర్ చెంతకు వివాదం



కలెక్టర్ చాంబర్ ఎదుట ధర్నా చేపడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో గత నెల 25 నుంచి జరిగిన ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల్లో అక్రమాలపై విచారణ జరగడం లేదు. టెన్త్, ఇంటర్ పాస్ సర్టిఫికెట్ల కోసం జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా రెండు వేలకు పైగా అభ్యర్థులు జిల్లాలో పరీక్షలు రాశారు. ఇందులో ఒకరికి బదులుగా మరొకరు పరీక్షలు రాస్తున్నా పట్టించుకోలేదు. మాస్ కాపీయింగ్ సైతం జోరుగా సాగింది. రాష్ట్ర పరిశీలకుడి తనిఖీల్లో పలువురు పట్టుబడ్డారు. తొమ్మిది మందిపై కేసులు నమోదయ్యాయి. అయితే ఈ పరీక్షల్లో పాస్ చేయించడం కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. అక్రమాలపై విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. దీంతో అధికారులు ఇద్దరు ఉద్యోగులకు మెమోలను జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఈ పరీక్షల్లో కింది స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు డబ్బులు పంచుకున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పరీక్షల నిర్వహణ అధికారులు, సిబ్బంది యూపీఐ ట్రాన్సాక్షన్లు పరిశీలిస్తే అక్రమాలు బయట పడతాయని చెబుతున్నారు.

సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

జిల్లాలో 11 పరీక్ష కేంద్రాల్లో ఎస్సెస్సీలో 1,019 మంది, ఇంటర్‌లో 1,162 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఓపెన్ పరీక్షల్లో కేంద్రాల వద్దనే ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున ఎస్సెస్సీ వారి నుంచి, అలాగే రూ.రెండు వేల చొప్పున ఇంటర్ అభ్యర్థుల నుంచి వసూలు చేశారని ఆరోపణలున్నాయి. ఇతరులతో పరీక్ష రాయిస్తే టెన్త్‌కు రూ.10వేలు, ఇంటర్‌కు రూ.20వేలు తీసుకున్నారని తెలిసింది. పరీక్షా కేంద్రాల డబ్బులు తీసుకున్నట్లు వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం అయ్యాయి. ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా రాష్ట్ర పరిశీలకుడు పట్టుకున్నారు. ఈ పరీక్షల్లో మొత్తం రూ.కోటి 30 లక్షలకు పైగానే వసూలు చేశారని తెలిసింది. ఒక్కో సెంటర్ నుంచి రూ.50వేల చొప్పున జిల్లా అధికారికి ముట్టజెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాము అందరికీ డబ్బులు పంచి పెట్టామని ఎవరూ సత్యపూస కాదని ఓ అధికారి మీడియా ప్రతినిధుల ముందు నోరుజారారు. అక్రమాలపై విచారణ చేపట్టాలని ఐదు రోజులుగా విద్యార్థి సంఘాల నేతలు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద తీవ్ర ఆందోళన చేపట్టారు. డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ నేతల బుజ్జగింపులు

ఆందోళనను చల్లబర్చడానికి రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు చెందిన కొందరు నేతలు విద్యార్థి సంఘాల నాయకులను మూడు రోజులుగా బుజ్జగిస్తున్నారు. ఆందోళన విరమించాలని, అందరికీ భారీగా డబ్బులు సెటిల్‌మెంట్ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. శనివారం సైతం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సమయంలో విద్యార్థి సంఘాల నాయకులకు ఆ నేతల నుంచి ఫోన్ రావడం గమనార్హం.

డబ్బులిచ్చినా..

వరంగల్ జిల్లా జనగాంకు చెందిన ఓ వ్యక్తి ఇంటర్ పరీక్ష కోసం దేవునిపల్లి పరీక్ష కేంద్రం వద్ద అధికారులకు రూ.20 వేలు ఇచ్చినట్లు తెలిపాడు. అయినా మాస్ కాపీయింగ్‌లో తనను పట్టుకుని కేసు అయ్యేలా చేశారని 'సాక్షి'తో శనివారం ఆవేదన వ్యక్తం చేశాడు. హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తి సైతం రూ.20వేలు ఇచ్చి, తనకు బదులుగా మరో వ్యక్తితో పరీక్ష రాయిస్తే మాస్ కాపీయింగ్‌లో కేసు నమోదు చేశారని చెప్పాడు. ఉద్యోగ రీత్యా పాస్ సర్టిఫికెట్ అవసరం కావడంతో రూ.10వేలు ఇచ్చానని మరో వ్యక్తి తెలిపారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల అక్రమాలపై విచారణ జరపాలని విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యాలయ గేటు ఎదుట బైఠాయించారు. లోపలికి చొచ్చుకుని పోయేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్ ముందు నిరసన తెలిపారు. కలెక్టర్ జితేష్ పాటిల్ వచ్చాక ఛాంబర్‌లో కలెక్టర్‌కు అక్రమాలపై వివరించారు. జిల్లా కో ఆర్డినేటర్ తుల రవీందర్, చీఫ్ సూపరింటెండెంట్లు కృష్ణారెడ్డి, మర్రి శేఖర్, సురేష్‌తో పాటు డీవో, సీఎస్‌లు, డీఈవో కలిసి విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేసుకుని పంచుకున్నారని ఆరోపించారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ నిమిత్తం కమిటీ వేసి సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ నాయకులకు హామీ ఇచ్చారు. బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఎస్ ఆజాద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బెరెనీ సందీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విశాల్, జిల్లా అధ్యక్షుడు బుల్లెట్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్‌యాదవ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, బీసీ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రభాకర్, ప్రవీణ్ తదితరులున్నారు.

నేర ప్రవృత్తిని వీడాలి



ఖలీల్‌వాడి: హక్కులు కోరే ముందు ఇతరుల హక్కులను గౌరవించాలని న్యాయసేవా సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్ అన్నారు. నిజామాబాద్ జైలులో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. నేర ప్రవృత్తిని వీడాలని, నేర రహిత సమాజం కోసం పాటు పడాలని చెప్పారు. ఉదయకృష్ణ, శుభం, ప్రమోద్ పాల్గొన్నారు.

తగ్గిన మద్యం ధరలు

ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం మద్యం ప్రియులకు గుడ్‌న్యూస్ చెప్పింది. బీరు, బ్రీజర్ మినహా మిగతా మద్యం ధరలను తగ్గిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడు నెలల క్రితం ప్రభుత్వం లిక్కర్‌పై రూ.10 నుంచి రూ.80 వరకు ధరలను పెంచింది. అప్పుడు పెంచిన ధరలను ఇప్పుడు తగ్గించింది. ఎన్నికల సమయం దగ్గర పడటంతో లిక్కర్ ధరలు తగ్గించిందనే ప్రచారం జిల్లాలో జరుగుతోంది.

తగ్గింపు ఇలా..

బీరు, బ్రీజర్‌తోపాటు రెడీ టూ డ్రింక్‌ల ధరలను యథాతథంగా ఉంచిన సర్కార్ లిక్కర్ ధరలను మాత్రం తగ్గించింది. క్వార్టర్‌పై రూ.10, హాఫ్‌పై రూ.20, ఫుల్‌బాటిల్‌పై రూ.40 తగ్గించింది. ఫుల్ బాటిల్ రూ.రెండు వేల కంటే ఎక్కువ ఉన్న మద్యం బ్రాండుల్లో క్వార్టర్‌కు రూ.20, హాఫ్‌కు రూ.40, ఫుల్‌బాటిల్‌కు రూ.80 తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లాలో 102 మద్యం దుకాణాలు, 20 బార్లు ఉన్నాయి. జిల్లాలో మద్యం ద్వారా మార్చిలో రూ.90 కోట్లు, ఏప్రిల్‌లో రూ.105 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా తగ్గిన ధరలు కొత్తస్టాక్ వచ్చిన తర్వాత అమలు కానున్నాయి.

ఉత్తర్వులు అందాయి

మద్యం ధరల తగ్గింపుపై ఉత్తర్వులు అందాయి. పాత స్టాక్‌ను పాత ధరలకే అమ్మాలి. కొత్త స్టాక్ వచ్చిన తర్వాత తగ్గిన ధరలకు అమ్మకాలు ఉంటాయి. – మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్

కాంగ్రెస్‌తోనే యువతకు ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, శేఖర్ గౌడ్, ముప్ప గంగారెడ్డి

ఖలీల్‌వాడి: కాంగ్రెస్‌తోనే యువతకు ఉద్యోగావకాశాలు దక్కుతాయని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు బాసటగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సరూర్‌నగర్‌లో ఈ నెల 8న యువ సంఘర్షణ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీ వస్తున్నారని చెప్పారు. యువకుల కోసం కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాల కల్పన, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. యువ సంఘర్షణ సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, గంగారెడ్డి, జావిద్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు



సుంకినిలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

రుద్రూర్: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని రైతులు పడొద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. పోతంగల్ మండలం హెగ్డోలి, కొల్లూర్, సుంకిని గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి తడిసిన ధాన్యాన్ని, కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని సేకరించి బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. పొడి ధాన్యం, తడిసిన ధాన్యం వేర్వేరుగా సేకరించాలని సూచించారు. రైతులు నష్ట పోకుండా ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, రైస్‌మిల్‌కు పంపించాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం తరలింపునకు 900 లారీలు వినియోగిస్తున్నామని, మరో రెండు వందల లారీలు ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఏవో శ్రీనివాస్‌రావు, జెడ్పీటీసీ శంకర్ పటేల్, ఎంఎసీ చైర్మన్ హమీద్, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బోధన్‌లో మాట్లాడుతున్న అసిస్టెంట్ పీపీ రాణి



నిజామాబాద్‌లో అదనపు పీపీ రాజేశ్ గౌడ్

బోధన్: శాంతి భద్రతల రక్షణ, నేర సంఘటనల విచారణకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే పోలీసులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో డివిజన్ స్థాయి పోలీస్ శాఖ అధికారులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య నేర విచారణ, సాక్ష్యాధారాల సేకరణ, ఎలక్ట్రానిక్ మీడియా చట్టా లు, ఎఫ్ఐఆర్, ప్రతిష్టాత్మకమైన పలు కోర్టు తీర్పు లు అంశాలను వివరించారు. ఏసీపీ కిరణ్‌కుమార్, బోధన్ టౌన్, రూరల్ సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ రాజు, ఎస్సైలు సందీప్, నవీన్, నరేష్, ఆనంద్, సాగర్, మచ్చేందర్ రెడ్డి, సాయన్న పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల చట్టాలపై అవగాహన

ఖలీల్‌వాడి: నగరంలోని న్యాయసేవా సదన్ హాల్‌లో శనివారం నిజామాబాద్ డివిజన్‌లోని పోలీసులకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్‌గౌడ్ మాదక ద్రవ్యాల చట్టాలపై అవగాహన కల్పించారు. తప్పు చేసిన వ్యక్తికి శిక్ష పడేటట్లు చూసే బాధ్యత పోలీస్ అధికారులకే ఉంటుందన్నారు. జిల్లా న్యాయసేవాధికారి పెండ్యాల పద్మావతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, కవితారెడ్డి, వసంత్ కుమార్, ఏసీపీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కోర్టులో పోలీసులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వరి అవగాహన సదస్సు నిర్వహించారు. చార్జీషీటు దాఖలుపై, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆర్మూర్ డివిజన్‌లోని సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్



మాట్లాడుతున్న ఆర్పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి

ఖలీల్‌వాడి: తాండూర్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ వివి సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోని ఆర్పీఎఫ్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి నిజామాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న జిల్లాలోని మల్లారం గ్రామానికి చెందిన సుధీర్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సుధీర్ నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోగా, దీని విలువ రూ. 2 వేలు ఉంటుందన్నారు. రెండు సెల్‌ఫోన్‌లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించామన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన దొంగతనం కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. మంచిప్ప గ్రామానికి చెందిన గోత్రాల నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పది ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, రైతులు

ధర్పల్లి: మండలంలోని ముద్దుల్ చెరువు స్టేజి వద్ద పంట పొలాల్లోని పది ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లు, ఆయిల్ ఎత్తుకెళ్లారు. రైతుల సమాచారం మేరకు శనివారం ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ ఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై కేసు

సిరికొండ: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సునీతపై కేసు నమోదు అయినట్లు ఎస్సై నర్సింలు శనివారం తెలిపారు. జనవరి 31న పదో తరగతి విద్యార్థి దినేష్‌ను తల వెంట్రుకల విషయంలో ప్రిన్సిపాల్ కొట్టిందని ఆయన తెలిపారు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు కోర్టులో ఫిర్యాదు చేయగా కోర్టు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



అశ్విత(ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామానికి చెందిన గుండాల అశ్విత(18) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అశ్విత ఇంటర్ చదువుతోంది. ఆమెకు ఓ యువకుడితో ప్రేమ వ్యవహారం ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. ఇంట్లో వారు గమనించి చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించగా ఆస్పత్రిలో మృతి చెందింది. కాగా అశ్విత తండ్రి కూడా గతంలో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రైలు కింద పడి ఒకరు..

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డికి సమీపంలోని అడ్లూర్ వద్ద జాతీయ రహదారి పక్కన రైలు పట్టాలపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదెల మృతి



మృతి చెందిన గేదెలు

సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందినట్లు సర్పంచ్ రమేష్ తెలిపారు. ఈదురు గాలులకు తెగి పడిపోయిన విద్యుత్ తీగలు తగిలి మిద్దెల లచ్చయ్యకు చెందిన రెండు, బొడ్డు రాములకు చెందిన ఒక గేదె మృతి చెందినట్లు సర్పంచ్ తెలిపారు. బాధితుడికి పరిహారం అందజేయాలని కోరారు.

ఎల్లారెడ్డిలో మేక..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్ను కుచ్చ ప్రాంతంలో శనివారం విద్యుత్ షాక్‌తో మేక మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు. పట్టణంలోని ఒకటో వార్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేక పోవడంతో షాక్ తగిలి మేక మృతి చెందినట్లు తెలిపారు.

ఐసీయూలో అమ్మ.. వదిలి వెళ్లిన నాన్న

- గాంధీ ఆస్పత్రిలో ఒంటరిగా బాలుడు
- అక్కున చేర్చుకున్న సిబ్బంది
- సమాచారం తెలిసి ఆస్పత్రికి వెళ్లిన బంధువులు

బోధన్: అమ్మ ఐసీయూలో ఉండగా.. వెంట వెళ్లిన నాన్న జాడ లేకుండా పోయాడు. దీంతో ఆరేళ్ల బాలుడు గాంధీ ఆస్పత్రిలో ఒంటరిగా తిరుగుతుండగా సిబ్బంది అక్కున చేర్చుకున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు.. సాలూరా మండల కేంద్రానికి చెందిన మాధవికి ఈ నెల 1న పురిటి నొప్పులు రాగా అంబులెన్స్‌లో బోధన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. వారు అదే రోజు ఆమెను గాంధీ తీసుకెళ్లాలని సూచించారు. కాన్పుకు హైరిస్క్ పరిస్థితి ఉన్నందున రిఫర్ చేసినట్లు తెలిసింది. దీంతో మాధవి భర్త గంగాధర్ ఆరేళ్ల కొడుకు సాత్విక్‌తో కలిసి అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు ఆమెకు కాన్పు చేశారు. పుట్టిన ఆడ శిశువు మృతి చెందింది. ఈ క్రమంలో మాధవి అపస్మారక స్థితిలో వెళ్లగా చికిత్స కోసం ఐసీయూలో చేర్చారు. మరుసటి రోజు మంగళవారం గంగాధర్ ఎవరికి చెప్పకుండా కొడుకును వదిలి ఆస్పత్రి నుంచి ఎటో వెళ్లిపోయాడు. దీంతో ఒంటరిగా ఆస్పత్రిలో తిరుగుతున్న చిన్నారిని సెక్యూరిటీ సిబ్బంది అక్కున చేర్చుకున్నారు. అనంతరం గ్రామస్తులకు సమాచారం అందజేశారు. దీంతో మాధవి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వెళ్లారు. ప్రస్తుతం మాధవి ఆరోగ్యం మెరుగుపడుతోందని వారు తెలిపారు.